క్లుప్తంగా

గోవులను సంరక్షించుకుందాం

అచ్చంపేట: గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ భాగవతుల రవికుమార్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల ప్రముఖ్ తుమ్మా మల్రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి అంకమ్మతల్లి దేవాలయం వద్ద శనివారం గోమాత పతాకాన్ని ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ గ్రామ కమిటిని నియమించారు. వీహెచ్‌పీ ఉత్తరప్రాంత ప్రముఖ్ సుబ్బారాయుడు, సహ ప్రముఖ్‌లు మన్నం చలపతిరావు పాల్గొన్నారు.

బెల్లంకొండ: గోవులను రక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పల్నాడు జిల్లా గోరక్ష ప్రముఖ్ తుమ్మా మల్రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో వీహెచ్‌పీ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోమాత జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ప్రముఖ్ రవికుమార్, ఉత్తరాంధ్ర ప్రముఖ్ సుబ్బారాయుడు, మన్నం చలపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన



అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో కార్పొరేట్ సెలూన్ షాపు ఏర్పాటును నిరసిస్తూ శనివారం అమరావతి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత మెయిన్ రోడ్డులోని మార్కెట్ సెంటర్ నుంచి మద్దూరుడౌన్ సెంటరు మీదుగా అంబేడ్కర్ బొమ్మ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెయిన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కార్పొరేట్ సెలూన్ షాపు ముందు సుమారు అరగంట సేపు నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సెలూన్‌లను వ్యతిరేకించాలని, తరతరాలుగా క్షౌరవృత్తి దారులను కాపాడాలని నినాదాలు చేశారు. అమరావతి నాయీ బ్రాహ్మణ సేవా సంఘ ప్రతినిధులు బి.సూరిబాబు, తుళ్లూరు కోటేశ్వరరావు, చింతపల్లి శివప్రసాదరావు, నాదెండ్ల నాగమల్లేశ్వరరావు నిడుముక్కల సాంబశివరావు, మార్కాపురం పూర్ణ, బి.సుబ్బు, బి.వెంకటేశ్వరరావు, జి.హనుమంతరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



రాజుపాలెం: మండలకేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు భక్తులచే యాగశాల వద్ద పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారికి తీర్థప్రసాదాలను అందించారు. యాగశాల హోమంలో దేవస్థానం వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పాత్తూరి వెంకట రమసుబ్బారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు హోమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. శనివారం మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని దేవస్థాన వ్యవస్థాపకులు తెలిపారు.

అనుగురాజు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం కరపత్రం ఆవిష్కరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం వద్ద యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ పల్నాడు రాజ్యాన్ని పరిపాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని భక్తులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం హాజరైన భక్తులకు పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, గండికోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు
- ఉట్టికొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత



వెంకటాయపాలెంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణుడు



అమరేశ్వరాలయంలోని వేణుగోపాలస్వామి



దమ్మాలపాడు మందిరంలో శ్రీకృష్ణునికి పూజలు

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని చంద్రాజుపాలెం, కందిపాడు, బెల్లంకొండ, మాచాయపాలెం, పాపాయపాలెం, వెంకటాయపాలెం గ్రామాలలో ఉదయాన్నే భక్తులు కృష్ణుడి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గంగిరెడ్డి పాలెం గ్రామంలో గల కృష్ణ దేవాలయంలో కృష్ణ భగవానుడికి గ్రామ ప్రజలు అభిషేకాలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా పలు గ్రామాలలో ఉటి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. వెంకటాయపాలెం గ్రామంలోని శ్రీ కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు చిన్నికృష్ణుని వేషధారణలు వేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరావతిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గోపాల్ నగర్‌లో వేణుగోపాలస్వామి దేవస్థానంలో అలయ అర్చకుడు పరాశరం రామకృష్ణమాచార్యులు స్వామివారికి వేకువన పంచసూక్తాలతో పంచామృత స్నపన నిర్వహించి విశేషఅలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి సహస్రనామపూజ నిర్వహించి మధ్యాహ్నం రుక్మిణి సత్యభామ సమేత వేనుగోపాలస్వామివారికి వైభవంగా కళ్యాణం నిర్వహించారు.

అమరేశ్వరాలయంలో..

అమరేశ్వరస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి విశేషాలంకారం చేశారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రోసూరులో...

గుడిపాడు(క్రోసూరు): మండలంలోని గుడిపాడు గ్రామంలో రామాలయం, అభయాంజనేయస్వామి, శివాలయాల అధ్యక్షుడు పాత్తూరి రామకృష్ణరావు ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద ఉట్టికొట్టే కార్యకరమం అట్టహాసంగా నిర్వహించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ పాత్తూరి శివ, పాత్తూరి చెన్నకేశవులు, ముక్కాల కాంతరావు, పలుకూరి వెంకటనారాయణ, చెవుల వెంకటరావు, పాత్తూరి చెన్నబాలకృష్ణ ,యువకులు పాల్గొన్నారు. క్రోసూరులోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమరావతి బస్టాండ్ సెంటర్, వాసవీ అమ్మవారి దేవాలయం సెంటర్, షిర్డీసాయిబాబు మందిర సెంటర్లలో ఉట్టికొట్టే కార్యక్రమాలు వైభవంగా, ఉత్సాహంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



వెంకటాయపాలెం ఆశ్రమంలో ఉత్సాహంగా ఉట్టికొడుతున్న చిన్నారులు

దమ్మాలపాడులో...

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దమ్మాలపాడు గ్రామంలోని శ్రీకృష్ణుని మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మాదల, కుందురువారిపాలెం, దమ్మాలపాడు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువకులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 75త్యాళ్ళూరు కోదండ రామాయణం వద్ద యువకులు ఉట్టికొట్టారు. సీతా రామచంద్ర స్వామివార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు గుత్తికొండ అంజిరెడ్డి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మహిళలు పాల్గొన్నారు.



75 త్యాళ్లూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ మూర్తుల గ్రామోత్సవం



క్రోసూరులో ఉట్టికొట్టే కార్యక్రమంలో యాదవ సంఘం యువకులు



వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుర్తుకొస్తున్నాయి..!

ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముప్పాళ్ళ: ఏరా అన్వర్ ఏం చేస్తున్నావు... అరే కోటిరెడ్డి ఎలా ఉన్నావు... సురేష్ నువ్వు లావు అయ్యావురా... బాలిరెడ్డి నువ్వు మారలేదురా... అనిత ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావు.. అంటూ సరదాగా సాగింది పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1988–93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఒకరినొకరు పలకరించుకుంటూ, చిన్ననాటి జ్ఞాపకాలు, అప్పటి తరగతి గదిలో చేసిన అల్లరి, ఉపాధ్యాయుల చీవాట్లు, పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన వారికి ఉపాధ్యాయుల ప్రశంసలు గుర్తు చేసుకుంటూ శనివారం సరదాగా గడిపారు. 32 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి తమ ఉన్నతికి కారణమైన పాఠశాలలో గత స్మృతులను, స్నేహన్ని గుర్తుకు చేసుకుంటూ, కుటుంబసభ్యుల వివరాలు, పిల్లల యోగ క్షేమాలు తెలుసుకుంటూ కులసాగా గడిపారు. ప్రస్తుతం ఎక్కడెక్కడ స్థిరపడ్డారో పరిచయం చేసుకుంటూ ముచ్చటించుకున్నారు. చదువు చెప్పిన గురువులను స్మరించుకుంటూ ఆనందంగా పాఠశాల ఆవరణలో కలియ తిరుగుతూ గడిపారు. అందరూ కలిసి భోజనం చేశారు. కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులైన కలగొట్ల బాలిరెడ్డి, అన్నదాసు సురేష్, పోటు వెంకటలక్ష్మీనారాయణ, తాళ్ల లత, సయ్యద్ అన్వర్‌లను అభినందించారు.

20న ఘంటసాల కళాపరిషత్ నాటకోత్సవాలు

సత్తెనపల్లి: ఘంటసాల కళాపరిషత్ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడివద్ద ఘంటసాల కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు జరుగుతాయని కళాపరిషత్ అధ్యక్షుడు బి.సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని వడ్డవల్లిలో శనివారం నాటక ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ నాటకోత్సవాలకు ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హజరవుతారన్నారు. నాటకోత్సవాల్లో మొదటి ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి భువి కోరని భ్రమణం నాటిక, రెండవ ప్రదర్శనగా ప్రదక్షిణ ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి ఎవరు నాటిక, మూడవ ప్రదర్శనగా పట్టణ సాంస్కృతిక సంఘం వారి హాస్యవల్లరి, నాలుగో ప్రదర్శనగా శాతవాహన వారి శ్రీరామ శ్రీ ఆంజనేయ సంవాదం పౌరాణిక నాటిక ప్రదర్శించబడుతుందన్నారు. ఘంటసాల కళా నిలయం ఆర్గనైజింగ్ కార్యదర్శి కంబాల శ్రీనివాస్, దాసరి తిరుపతిరావు, బోడపాటి తిరుపతి రావు, తోట హరిబాబు, శిఖ ఆదామ్, మాతంగి సాంబశివరావు, సభ్యులు మారం మనోహర్, వెంకటేష్, రాజబాబు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ బాధ్యులు

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుసేన్

రెంటచింతల: కార్మికులు సంఘంగా ఏర్పడితేనే హక్కులు సాధించుకోవచ్చని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడి హక్కుల సాధనకు సంఘం ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం



పెదకూరపాడు: విద్యార్థులకు శుద్ధ జలాలను అందించడమే లక్ష్యమని దాత కొండపనేని సాంబశివరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సౌజన్యంతో పెదకూరపాడు ఆనందపేటలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు తెనాలి తాలూకా మంచికలపూడి గ్రామానికి చెందిన కొండపనేని సాంబశివరావు, సుబ్బారావు, మౌళయ్యలు శుద్ధ జలాల ప్లాంట్‌ను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ప్రెసిడెంట్ రొటేరియన్ కొండపనేని విజయ్‌కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందుంటుందని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాయపూడి సాంబశివరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కనకపూడి మరియమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు కాపీ బుక్స్, పెన్సిల్స్ తదితరాలతో ఉన్న కిట్లను పంపిణీ చేశారు.

నిలిచిన వరద నీటితో ఇక్కట్లు

తటాకంగా దొడ్లేరు ఎస్సీ కాలనీ




దొడ్లేరు ఎస్సీ కాలనీ లూథరన్ చర్చి వీధిలో నిలిచిన వర్షం నీరు

దొడ్లేరు(క్రోసూరు): గత నాలుగురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు, వచ్చిన వరదల వల్ల ఏర్పడిన నీటి కుంటలు అలాగే ఉండిపోవడంతో దొడ్లేరు ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి వీధిలో నీరు నిలిచిపోయింది. వీధికి దగ్గర్లోని రాజీవ్ గాంధీ సెంటర్ (పిడుగురాళ్ల – క్రోసూరు రోడ్డు) ఎత్తులో ఉండటం, పాత డ్రైనేజీ కల్వర్టులు పగిలిపోవటంతో ఎటూపోలేక నీరు వీధిలోనే నిలబడుతోంది. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోని వీధిని బాగు చేయాలని కోరుతున్నారు.

■ దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకయ్యను వివరణ కోరగా, వరద నీరు పోయేందుకు మార్గం లేదని, అయితే ప్రత్యామ్నాయంగా ఎన్ఆర్‌జీఎస్‌లో భాగంగా సోక్‌పిట్ ద్వారా నీటిని భూమిలోకి ఇంకే విధంగా చేస్తామని తెలిపారు.

సంఘ సేవకులకు ఉత్తమ పురస్కారాలు



కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న చిలక జాన్సన్, గంజి వీరాస్వామి

సత్తెనపల్లి: ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవలు అందిస్తున్న ముగ్గురికి 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముగ్గురికి ఉత్తమ పురస్కారాలు అందాయి. పట్టణానికి చెందిన మదర్ థెరిసా ఆదరణ సంక్షేమ కేంద్రం అధ్యక్షుడు, బ్యాంక్ ఆఫ్ బరోడా హెడ్ క్యాషియర్ చిలక జాన్సన్, పట్టణంలోని 31వ వార్డుకు చెందిన సేవాతత్పరుడు గంజి వీరాస్వామి, ఫ్రెండ్స్ బ్లడ్ డోనార్స్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు ఉత్తమ సేవలు అందించినందుకుగాను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రత్యేకంగా అభినందించారు.



మంత్రి మనోహర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆంజనేయులు

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామంలో జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.13.05 లక్షలు విలువైన నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ సిహెచ్ మణికృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23 తేదీన మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల నామాల మీనా ఇంటిలో చోరీ జరిగింది. ఇంట్లోని 60 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు, ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీనిపై నామాల మీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన గాలం రాజేష్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రాజేష్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకున్నట్లు పోలీసులకు నిందితుడు తెలిపాడు. దీంతో నిందితుడి వద్ద నున్న రూ.13.05 లక్షలు నగదు,ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

నేడు గోశాలలో కృష్ణాష్టమి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గో సంరక్షణ శాల కళ్యాణ మండపంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు కృష్ణ కృపా మూర్తి ఇస్కాన్ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి నందోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ భక్త బృంద ప్రతినిధి కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి) శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు గోపూజ, 10:30 గంటలకు ఉట్లోత్సవం, 12 గంటల నుంచి 1:30 గంటల వరకు మహా శంఖాభిషేకం (56 రకముల విశేష ద్రవ్యములతో) తదుపరి 108 రకములతో మహారాజభోగ నివేదన, హెచ్‌జి వైష్ణవకృపదాస్ చే శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం అనంతరం మహా ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.